క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్: మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని నగర ఈఈ శ్రీనివాసబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకుమానువారితోట సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వసంత రాయపురం, బొంగరాలబీడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. గోరంట్ల సబ్ స్టేషన్ పరిధిలో గోరంట్ల, టీచర్స్ కాలనీ, భాష్యం స్కూల్, మల్లికార్జునపురం ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుంటూరులో కుండపోత



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో గురువారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటల తరువాత నుంచి సాయంత్రం 4 గంటల వరకు వర్షం కురుస్తునే ఉండటంతో నగర వాసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. రాకపోకలు సాగించే వాహనదారులు కొన్నిగంటల పాటు ఎక్కడి వారే అక్కడి నిలబడిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంతా లోతట్టు ప్రాంతాలైన డొంకరోడ్డు, పాతగుంటూరు, అరండల్‌పేట, కొరిటెపాడు, బ్రాడీపేట, నెహ్రూనగర్ ప్రాంతాల్లోని కొన్ని వీధులు జలమయం అయ్యాయి.


క్విజ్ పోటీలకు విశేష స్పందన

ఏఎన్‌యూ: బిజినెస్ క్లబ్‌లో భాగంగా యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్విజ్ పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. 19 బృందాల నుంచి 76 మంది విద్యార్థులు మొదటి దశ క్విజ్‌లో పాల్గొన్నారు. ఈ దశలో ప్రతిభ కనబరిచిన ఎనిమిది బృందాలను రెండో రౌండ్‌కు ఎంపిక చేశారు. రెండో రౌండ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మూడు బృందాలను విజేతలుగా ప్రకటించారు. వీరిలో శిరీష నేతృత్వంలోని బృందం మొదటి బహుమతిని, పి.విజయలక్ష్మి నేతృత్వంలోని బృందం రెండో బహుమతిని, సాగర్ నేతృత్వంలోని బృందం మూడవ బహుమతిని పొందాయి. ఫలితాలను కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి ఆచార్య ఆర్.శివరామ్‌ప్రసాద్ ప్రకటించి విజేతలకు అభినందనలు తెలిపారు. క్విజ్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎస్.రత్నకిషోర్, డాక్టర్ ఎస్.ప్రసన్న కుమార్ వ్యవహరించారు. విభాగ అధ్యాపకులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ విష్ణు, డాక్టర్ సుధీర్, డాక్టర్ భానురెడ్డి, డాక్టర్ రాజీవ్ పోటీలను పర్యవేక్షించారు.

తురకా లేని లోటు తీరనిది

బోరుపాలెం(తాడికొండ): ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు తురకా శ్రీనివాసరావు మృతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పార్టీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తుళ్లూరు మండలం బోరుపాలెం గ్రామంలో గురువారం జరిగిన వర్ధంతి సభకు సురేష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తురకా శ్రీను చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీను కుటుంబసభ్యులను ఓదార్చిన ఆయన రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి భవిష్యత్తులో కూడా కుటుంబానికి అండగా ఉంటానని, పిల్లల చదువులకు కావాల్సిన చేయూత అందిస్తానన్నారు. ఆయన వెంట పలువురు మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

అదనపు సీఐగా హుస్సేన్ బాధ్యతల స్వీకారం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ అదనపు సీఐగా మొహమ్మద్ అల్తాఫ్ హుస్సేన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తాడేపల్లిలో సీఐగా పని చేసిన సాంబశివరావు సీఐడీకి బదిలీ కావడంతో మేడికొండూరు సీఐగా పనిచేసిన హుస్సేన్ బదిలీపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు.

ఇస్కాన్ టెంపుల్‌లో నరసింహ ఆవిర్భావ దినోత్సవం



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఉన్న ఇస్కా న్ టెంపుల్‌లో గురువారం నరసింహ ఆ విర్భావ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. నరసింహస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆయన చరిత్రను ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షులు చక్రవర్తి దాస్ వివరించారు. తల్లిదండ్రులు పిల్లల్లో భక్తి భావాన్ని పెంపొందించాలని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మహాప్రసాదాన్ని స్వీకరించారు.

ట్రేడ్ లైసెన్స్ లేకుంటే దుకాణాలు సీజ్

నగర కమిషనర్ కీర్తి చేకూరి



షాపును సీజ్ చేస్తున్న ప్రజారోగ్య అధికారులు

నెహ్రూనగర్: నగరంలో డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తే షాప్స్ సీజ్ చేయడంతో పాటుగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం నగరంలోని ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్‌లో ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రజారోగ్య అధికారుల బృందం వ్యాపార, వాణిజ్య సంస్థలకు ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నదీ లేనిది, రెన్యువల్, ట్రేడ్ ఫీజుల చెల్లింపుపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. డ్రైవ్‌లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్న మెకానిక్ షాప్‌ను సీజ్ చేసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోవడంపై కర్రీస్ పాయింట్‌కు రూ.5 వేలు అపరాధ రుసుం విధించారు. మరో 5 దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ మాట్లాడుతూ చట్ట ప్రకారం నగరంలో ప్రతి వ్యాపార వాణిజ్య సంస్థ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. లైసెన్స్ తీసుకోకుండా వ్యాపారం చేస్తే సీజ్ చేయక తప్పదని, ఇప్పటికే సచివాలయాల వారీగా ఉన్న షాప్స్, వాణిజ్య సంస్థల డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ వివరాలు తీసుకుంటున్నామని తెలియజేశారు. వివరాలు అందిన వెంటనే తగిన చర్యలు తీసుకోవడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. గతంలో తీసుకున్న లైసెన్స్‌లను కొందరు రెన్యువల్ చేసుకోలేదని, వారు కూడా వెంటనే రెన్యువల్ చేసుకోవాలన్నారు. అలాగే వ్యాపార సంస్థలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యంగా హోటల్స్, టిఫిన్, కర్రీస్ పాయింట్స్ వంటి ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమ వ్యాపార నిర్వహణ కోసం ట్రేడ్ లైసెన్స్‌ని సమీప వార్డ్ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే నిర్దేశిత గడువులోగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. శానిటరీ సూపర్‌వైజర్లు ఆనందకుమార్, సోమ శేఖర్, ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున రావు, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే ధ్యేయం కావాలి

నగరపాలకసంస్థ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ డాక్టర్ జి.అనిల్ కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ జి.అనిల్ కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ మానవాళితో పాటు సమస్త జీవాలకు, పర్యావరణానికి ముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్ భూతాన్ని తరిమే కృషిలో రేపటి తరానికి వారసులైన విద్యార్థులు, యువత ఉద్యమంగా ముందుకు రావాలని నగరపాలకసంస్థ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ డాక్టర్ జి.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఐటీసీ వంటి స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలు, పునరుత్పత్తి మేనేజ్‌మెంట్ అంశాలపై నగరపాలక సంస్థ విద్యాసంస్థల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. 400 ఏళ్లపాటు భూమిలో కరగకపోవడంతో పాటు 16 తరాలపై తీవ్ర ప్రభావం చూపించే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఇతర ఉత్పాదక వస్తువుల వాడకాలపై ప్రజలు శ్రద్ధ కనపరచాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత సమాజానికై విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి మాట్లాడుతూ తమ కళాశాలలో ఏర్పాటు చేసి ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, వాటర్ బాటిల్స్ తదితర ప్లాస్టిక్ వ్యర్థాలను డస్ట్‌బిన్ల ద్వారా సేకరించి నగరపాలక సంస్థకు అందిస్తున్నట్లు తెలియజేశారు. నగరపాలసంస్థ రిసోర్స్ పర్సన్ వి.జస్వంత్, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ ఏ.అపర్ణ సీతారాం, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ బి.శ్రీదేవి, డాక్టర్ కె.అనూష, అధ్యాపకులు ఎం.కమల కరుణ, డాక్టర్ లక్ష్మీప్రమీల, డాక్టర్ డి.మల్లికార్జున రావు, కె.లక్ష్మి కృష్ణారావు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో మెగా స్క్రీన్‌పై ఐపీఎల్ మ్యాచ్‌లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీసీఐ కో-ఆర్డినేటర్ ఎం.సుమిత్

గుంటూరు వెస్ట్(క్రీడలు): ఐపీఎల్ మ్యాచ్‌లను మెగా స్క్రీన్‌పై ఉచితంగా వీక్షించే అవకాశాన్ని నగర ప్రజలకు కల్పిస్తున్నామని బీసీసీఐ కో–ఆర్డినేటర్ ఎం.సుమిత్ తెలిపారు. గురువారం స్థానిక అరండల్‌పేటలోని హోటల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6, 7 తేదీల్లో స్థానిక బ్రాడీపేటలోని ఎల్‌ఈఎం స్కూల్లో ఏర్పాటు చేశామన్నారు. నేరుగా మైదానంలో చూసే అనుభవం కలుగుతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా 45 నగరాల్లోని ప్రజలకు ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. 6వ తేదీన చెన్నై సూపర్ కింగ్స్– ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్– రాయల్ చాలెంజ్ బెంగళూరు మ్యాచ్‌లు, 7వ తేదీ గుజరాత్ టైటాన్స్–లక్నో సూపర్ జయంట్స్, రాజస్థాన్ రాయల్స్– సన్ రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లు ప్రసారం చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షులు ఎంఎల్‌పీవీ రమణమూర్తి, ఏసీఏ సభ్యులు అన్నంరాజు సాయిరాం, జీడీసీఏ సభ్యులు రామశర్మ పాల్గొన్నారు.

'హిందూ ఫార్మసీ'లో రక్తదాన శిబిరం



మొబైల్ రక్తదాన శిబిర వాహనం వద్ద విద్యార్థులతో జూపూడి రంగరాజు, భాస్కరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, గుంటూరు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యాధికారి డాక్టర్ ఎం.భాస్కరరావు మాట్లాడుతూ థలసేమియా వ్యాధి గ్రస్తులతో పాటు రక్తహీనత ఎదుర్కొంటున్న వారికి రక్తనిధిని ఏర్పాటు చేసేందుకు రక్తదాన శిబిరాన్ని చేపట్టామని తెలిపారు. ఈసందర్భంగా కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఫీల్డ్ అధికారి షేక్ జానీ రసూల్, కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఎన్‌సీసీ ఏఎన్ఓ సీహెచ్ అజిత్‌బాబు, రెడ్‌క్రాస్ ఏఓ జె. రఘు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'మలినేని'లో ఘనంగా ప్లేస్‌మెంట్ డే



తల్లిదండ్రులను సత్కరిస్తున్న చైర్మన్ రామచంద్ర ప్రభు, ఆర్జేడీ, కళాశాలల చైర్మన్ మలినేని

ప్రత్తిపాడు: సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని తులసి సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు అన్నారు. వట్టి చెరుకూరు మండలం పుల్లడి గుంటలోని మలినేని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2022–23 విద్యా సంవత్సరంలో వివిధ విభాగాలకు చెందిన 400 మంది విద్యార్థులు టీసీఎస్, అసెంచ్యూర్, కాగ్నిజెంట్, వొడాఫోన్, ఎల్ అండ్ టీ, యాక్సిస్ బ్యాంక్, హెక్సావేర్, టెక్ మహీంద్ర వంటి బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. స్థానిక కళాశాలలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన తులసి రామచంద్ర ప్రభును ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. యువత ఉద్యోగం పొందడం నుంచి ఉద్యోగావకాశాలు కల్పించే పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల విద్య ఆర్జేడీ జీవీఎస్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా విద్యార్థుల నైపుణ్యం పెంపొందించడం కోసం ఎన్నో అవకాశాలను కల్పిస్తోందన్నారు. ఇందుకు ప్రత్యేక నిధులను వెచ్చిస్తోందని చెప్పారు. కళాశాలల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ల మాట్లాడుతూ ఈ ఏడాది ఐటీ రంగం మాంద్యంలో ఉన్నప్పటికీ మూడేళ్లుగా వృత్తి నైపుణ్య తరగతుల వల్ల 400 మంది విద్యార్థులకు అంతర్జాతీయంగా పేరుపొందిన కంపెనీల్లో ఉద్యోగాలొచ్చాయన్నారు. ట్రైనింగ్స్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్వేత మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో ఏటా ట్రైనింగ్ క్లాసులు ఏర్పాటు చేసి, విద్యార్థుల విజయానికి కృషి చేసినట్లుచెప్పారు. కళాశాలల డైరెక్టర్ దేవిరెడ్డి శ్రీనివాసకుమార్, పాటిబండ్ల నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ జెట్టి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, కళాశాల డీన్‌లు పి.రమేష్, కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తాడికొండ: వేసవిలో దాహార్తిని తీర్చేందుకు ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలు విరివిగా ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గురువారం తుళ్లూరులో సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కూలింగ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన కూడళ్ల వద్ద మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బోరుపాలెం గ్రామ సచివాలయాన్ని కత్తెర సురేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.

బాలిక అదృశ్యంపై కేసు

గుంటూరు ఈస్ట్: బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రగతినగర్‌లో నివసించే ఓ కుటుంబానికి చెందిన బాలిక బుధవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బ్రాడీపేట 2/5లో నివసించే అవనిగడ్డ కల్యాణి గతనెల 10వ తేదీ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఊరు వెళ్లింది. బుధవారం ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని స్థానికులు ఫోన్ చెసి సమాచారం ఇచ్చారు. గురువారం గుంటూరు వచ్చి ఇల్లు పరిశీలించగా బీరువాలోని రూ.80వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల్లుడిపై దాడి

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకానిలో అల్లుడిపై అత్తా, మామ, బావమరిది కలసి దాడి చేశారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చినకాకానికి చెందిన సత్తెనపల్లి రాజశేఖర్‌కు అదే ప్రాంతానికి చెందిన గండికోట వెంకటశివరావు, దుర్గారాణి దంపతుల కుమార్తెతో కొన్నేళ్ల కిందట వివాహమైంది. కొంతకాలంగా ఇరు కుటుంబాల మధ్య కలహాలు రేగా యి. ఈ నేపథ్యంలో గురువారం రాజశేఖర్‌తోపాటు ఆయన తల్లిదండ్రులపై వెంకట శివరావు–దుర్గారాణి, ఆమె కుమారులు శ్రీహరి,రామకృష్ణతోపాటు వారి దగ్గర బంధువు గుర్రం ఏసుబాబు దాడికి పాల్పడ్డారు. రాజశేఖర్‌తోపాటు ఆయన తల్లిదండ్రులకు గాయాలయ్యాయి.

సొంత నిధులతో రహదారికి మరమ్మతులు

అనంతవరం(తాడికొండ): రోడ్డు సౌకర్యం సరిగా లేదంటూ ఆర్టీసీ సర్వీసులు నిలిపివేయడంతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ చొరవతో బస్సును పునరుద్దరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు అధ్వానంగా ఉందని మూడేళ్లుగా మంగళగిరి–అమరావతి బస్సులు సర్వీసులను నిలిపివేశారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు సురేష్‌కుమార్ సొంత నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించి ఆర్టీసీ అధికారులతో సంప్రదించడంతో బస్సు సౌకర్యం పునరుద్ధరించారు. గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ తమ అభ్యర్థన మేరకు బస్సు సర్వీసును పునరుద్దరించడం హర్షణీయమని, ఆర్టీసీ సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డామని, చొరవ తీసుకొని పరిష్కారానికి కృషి చేసిన కత్తెర సురేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామపార్టీ అధ్యక్షుడు పోలు రమేష్, స్థానిక నాయకులు బండ్ల శ్రీకాంత్, మేకల రవీంద్ర, మేకల వెంకటేశ్వరరావు, జోజి పాల్గొన్నారు.

మిర్చి పంట పరిశీలన



ప్రత్తిపాడు: జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎన్.సుజాత మిర్చి పంటను పరిశీలించారు. ఐదు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్తిపాడు హెచ్‌వో బేబితో కలిసి పాత మల్లాయపాలెం, కొత్తమల్లాయ పాలెం గ్రామాల్లో ఆమె పర్యటించారు. కల్లాల్లోకి వెళ్లిన తడిసిన మిర్చిని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. తేమశాతం, తాలు కాయలు, పెట్టు బడి, దిగుబడి.. వంటి విషయాలను తెలుసుకున్నారు. మండలంలో దాదాపుగా 90 శాతం మిర్చి కోతలు పూర్తయ్యాయని, మిగిలినవి కల్లాల్లో ఎండ బెట్టారని చెప్పారు.

ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

పట్నంబజారు: గుంటూరు ఎస్పీ కె.ఆరీఫ్ హఫీజ్ గురువారం ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలకు సంబంధించి స్టేషన్ సీఐ నిసార్ బాషాను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకోవడంతోపాటు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. రాత్రిళ్లు విధులు నిర్వర్తించేవారు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్, పల్నాడు బస్టాండ్, నాజ్‌సెంటర్, ఓల్డ్‌క్లబ్ రోడ్డు, మణిపురం బ్రిడ్జి, తదితర ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ నరసింహారావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

820 మందిపై 758 కేసులు నమోదు..

నగరంపాలెం: కొద్దిరోజులుగా జిల్లావ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన 820 మందిపై 758 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.ఆరీఫ్ హఫీజ్ గురువారం తెలిపారు. పోలీసు అధికారులు పలు ప్రాంతాల్లో పర్యటించి అటువంటి వారిపై టౌన్ న్యూసెన్స్ చట్టంతోపాటు, ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగిసిన అమ్మవారి జయంత్యుత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముస్తఫా

పాత గుంటూరు: ఆర్.అగ్రహారంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అర్బన్ జిల్లా ఆర్య వైశ్య సంఘం, యువజన సంఘం, సేవాదళ్, మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారి జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం విశేష పూజలు, అమ్మవారికి లక్ష గులాబీ పూలతో పుష్పార్చన, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, టీఎల్‌వీ వీరాంజనేయులు, సంఘాల అధ్యక్షులు ఆతుకూరి నగేష్‌కుమార్, అమరా శ్రీనివాసరావు, మొగిలి సతీష్‌కుమార్, యిమ్మడిశెట్టి ప్రమీలారాణి, కార్యదర్శులు యేచూరి వెంకయ్య, జి.మహేష్, రంగా మురళీకృష్ణ, అమరా షర్మిల, కోశాధికారులు రవికుమార్, నాగేంద్ర,శ్రీకాంత్, పరిమి నాగ పరిపూర్ణ, ఈఓ దుర్గారావు, పర్యవేక్షించారు.

నైపుణ్యాలు పెంచుకుంటే ఉన్నత భవిష్యత్

ఏఎన్‌యూ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డీన్ భట్టు నాగరాజు



నగదు పురస్కారాలు అందజేస్తున్న ఆచార్య నాగరాజు, ఎస్వీ రమణ, డాక్టర్ నరేన్, లలిత

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యపై శ్రద్ధాసక్తులే విద్యార్థులను ప్రతిభావంతులుగా నిలబెడతాయని ఏఎన్‌యూ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డీన్ ఆచార్య భట్టు నాగరాజు పేర్కొన్నారు. గురువారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి, మంచి నడవడికతో నైపుణ్యాలను పెంచుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. రమేష్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ రావెల నీరేన్ మాట్లాడుతూ విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ఏఎన్‌యూ ఇటీవల విడుదల చేసిన ద్వితీయ సంవత్సర తృతీయ సెమిస్టర్ ఫలితాల్లో ఎంబీఏ, ఎంకామ్‌లలో నూరుశాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎంబీఏలో షేక్ రిజ్వానా, జి.లక్ష్మీ సౌమ్య, ఎం.కీర్తి చంద్రిక, ఎంకామ్‌లో పి.శ్రీవాణి, ఎ.వైష్ణవి, కిరణ్‌కుమార్ నగదు బహుమతులు పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, ప్రొఫెసర్ కె.లలిత, సహాయాచార్యులు కల్యాణి, వైష్ణవి, బాజీబాబు, వేదవతి, పద్మావతి, మణికంఠ, అభిలాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్లొరెన్స్ నైటింగేల్ విగ్రహావిష్కరణ



ఫ్లొరెన్స్ నైటింగేల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సుశీల, వల్లి, తదితరులు

గుంటూరు మెడికల్: గోరంట్ల ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో గురువారం ఫ్లొరెన్స్ నైటింగేల్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గతంలో నర్సింగ్ డెప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసి, కోవిడ్‌తో చనిపోయిన చదలవాడ శ్రీలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె భర్త గుంటూరుకు చెందిన దొడ్డా గోవిందరావు ఫ్లొరెన్స్ నైటింగేల్ విగ్రహాన్ని నర్సింగ్ కళాశాలకు బహూకరించారు. అంతేకాకుండా నర్సింగ్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించేందుకు రూ. 15 లక్షలు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి విరాళంగా అందజేశారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ కె.సుశీల, నర్సింగ్ డెప్యూటీ డైరెక్టర్ వల్లి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కళావతమ్మ, తదితరులు పాల్గొని విగ్రహదాత దొడ్డా గోవిందరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

త్రిచక్ర వాహనాల పంపిణీ



విభిన్న ప్రతిభావంతులకు వాహనాలను అందజేసిన ఎమ్మెల్యే సుచరిత

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. గురువారం బ్రాడీపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ సహకారంతో పది మంది లబ్ధిదారులకు త్రి చక్రాల మోటార్ వాహనాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులైన మేరుగ ఎస్తేర్‌రాణి, వి.శ్రీకాంత్ భరత్‌రెడ్డి, బి.పరమారెడ్డి, ఆర్.మహేష్‌బాబు, వి.జీవన్‌బాబు, షేక్ కరిముల్లా, ఎన్.భాగ్యలక్ష్మి, బి.నరసింహారావు, వై.మరియరాణి, బి.ఏసోబు తదితరులకు వాహనాలను అందజేశారు. విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ ముతాజ్ పఠాన్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు ఉద్దగిరి మురళి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఓం ప్రకాష్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ

పొన్నూరు(చేబ్రోలు): ప్రభుత్వం పొదుపు సంఘాలను ప్రోత్సహించేందుకు కల్పిస్తున్న ఆర్థిక రుణాలు పారదర్శకంగా ఉండేందుకు లోకోస్ యాప్ ఉపయోగపడుతుందని పొన్నూరు ఎంపీపీ భవనం పద్మలీల పేర్కొన్నారు. పొన్నూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ ద్వాక్రా సంఘాల అసిస్టెంట్స్‌కు లోకోస్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పద్మలీల పాల్గొని, మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఒకే యాప్‌లో మహిళా సంఘాల సభ్యుల లావాదేవీలు వివరాలు చూసుకోవటానికి లోకోస్ యాప్ ఉపయోగపడుతుందన్నారు. ప్రతి వీవోఏ సంఘ సభ్యుల వివరాలు పారదర్శకంగా పక్కాగా నమోదు చేసేందుకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఏపీఎం గోపీ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) ఆధ్వర్యంలో ఈ యాప్ పనిచేస్తుందన్నారు. లోకోస్ యాప్ పనిచేసే విధానాన్ని వీవోఏలకు వివరించారు. ఎంపీడీఓ భవనం మారుతి శేషమాంబ పాల్గొన్నారు.